# శాంతిదూతలు



STATE CENTRAL LIBRARY HYDERABAD A.P.

1999 డిసెంబరు 31 వ తేదీ సాయంకాలం 7 గంటలు. చంద్రమండలంనుండి రివ్వున అంతరిక్షమార్గంగుండా ఒక ఫ్లయ్యింగ్ సాసర్ భూమండలంవైపు వస్తూ ఉంది. ఆకాశంలో నక్షత్రాలమధ్యనుండి ప్రయాణం చేస్తూ పాలబాటగుండా కిందికి దిగుతున్నది. ఆ దిగడం జపాన్‌దేశంమీద—హిరోషిమాలో వేలకొలది ప్రాణాలు ఒక్కక్షణంలో ఆహుతి అయినచోట. అప్పటికి ప్రపంచంలో జీవకోటి నశించింది, అణుయుద్ధంమూలంగా. ఆటంబాంబుకు ప్రారంభోత్సవం చేసిన హిరోషిమా భూభాగంపైనుండి ఫ్లయ్యింగ్ సాసర్‌లో ఉన్న వ్యక్తి ఏదో యంత్రం ద్వారా చూస్తూ ఉన్నాడు. అప్పటి జపాన్‌దేశపు యుద్ధ సామగ్రి ఎలా ఉన్నదీ పరిశోధన చేయుడానికే అతను భూమిమీదికి వచ్చాడు. దానిని గురించి పరిశోధన చేసిన తర్వాత తానొక థీసిస్ వ్రాయాలి.

స్పేస్‌షిప్ భూభాగంమీదికి దిగింది. అందులోనుంచి విద్యార్థి దుస్తుల్లో ఒక పాతికేళ్ళ యువకుడు దిగి, నోటు పుస్తకంలో ఏదో వ్రాస్తూ ఉన్నాడు. జపాన్ యాభై సంవత్సరాలకిందట వాడిన యుద్ధ పరికరాలు భూగర్భంనుండి తవ్వి, అవి ఎలాటివో వ్రాయాలి.

ఒకచోట నిశ్శబ్దాన్ని భంగంచేస్తూ, కొన ఊపిరితో ఇద్దరు వ్యక్తులు గుసగుస లాడుకుంటూన్నట్టు ఊపిరి ధ్వని వినవస్తున్నది. విద్యార్థి తనపని మాని ఆ మాటలు వింటున్నాడు.

బి. వి. నరసింహం

కర్త ఉన్నా కర్మ లేకపోవచ్చు. కాని కర్మ ఉంటే కర్త ఉండితీరాలి. సృష్టి స్థితి లయాలకు కర్త ఎవరైనా ఉండాలని, అతడు భగవంతుడని—నామ రూపాలు ఏమైనా—నమ్ముతున్నారు. ఆ విధంగా సృజించబడ్డ మానవుడు ఆత్మ వినాశానికి, ప్రపంచ వినాశానికికూడా కారణం కాగలశక్తి సంతరించుకొన్నాడు. అంతమాత్రంచేత సృష్టికర్తకు తన సృష్టిపై మమత నశిస్తుందా?

"ఫూజికో, ఫూజికో! ఇలారా. నా చెయ్యి పట్టుకో!"

"అకిరా, అకిరా! నన్ను వదలకు."

"ఎంత వెదికినా పాపాయి జాడలేదే?"

"ఇంకెక్కడి పాపాయి? నా కడుపులో చిచ్చు పెట్టి అగ్నిజ్వాలలకు ఆహుతి అయింది."

"మన ఆశలతో నిర్మించుకున్న ఈ పాపాయి మనకు లభించదా?"

విద్యార్థికి మాటలు గాలి శబ్దంచేస్తున్నట్లు వినవస్తున్నాయి. కానీ మనుష్యులు మాత్రం కనపడటంలేదు.

"అకిరా! ఇవాళ పాపాయి పుట్టినదినం. ఇలాటి దినాలు ఎంతో వైభవంగా చేసుకుందామని కలలు కన్నాను. కానీ మొదటి ఏడాది పుట్టినదినమే చేసుకోలేకపోయాను. దురదృష్టవతిని."

"ఫూజికో! విచారించకు. ఎంత వాపోతే ఏంలాభం? తమ శక్తి సామర్థ్యాలు ప్రకటించడానికి హిరోషిమా దొరికింది శత్రువులకు. మానవత గర్వపడింది, మన నాశనంతో. మన శరీరాలు ఏనాడో నాశనమయ్యాయి. మన ఆత్మలు మాత్రం మిగిలాయి. మన పాపాయి ఆత్మ

## శాంతిదూతలు

ఎక్కడుందో? యుద్ధం మన ప్రేమకు భంగం వాటిల్లనీయలేదు. మన ప్రేమ అంత బలమైంది. శరీరాలు నశించినా మన ఆత్మలను వేరు చెయ్యలేకపోయింది యుద్ధం.

విద్యార్థి ఉలిక్కిపడ్డాడు.

క్షణం నిశ్శబ్దం.

నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ ఒక భయంకరమైన మూలుగు. ఒక నిట్టూర్పు. రహస్యంగా గాలిలోనే మాటలు. ఆ మూలుగు హృదయవిదారకంగా ఉంది. ఆ నిట్టూర్పు వడికి చెట్లుకూడా కూకటివేళ్లతో పెల్లగించుకుపోయేలా ఉన్నాయి. ఆ మూలుగు శబ్దంవిని విద్యార్థి సొమ్మసిల్లిపోయాడు. మళ్లీ తెలివి తెచ్చుకొని, తనకు తాను ధైర్యం గరపుకొన్నాడు—'ఏమీలేదు, ఉత్త భ్రమ' అనుకొని. అతని అంతర్వాణి చెబుతూంది—'ఇది భ్రమకాదు, నిజం' అని. తను వచ్చిన పని వృథా అయిందనుకొని విద్యార్థి విమానంలో కూర్చుని చంద్రమండలంవైపు ప్రయాణమైనాడు.

## 2

"అకిరా! అకిరా! మన పాపాయి దొరికింది. చూడు, ఎలా నవ్వుతోందో!"

"ఫూజికో! పిచ్చికానీ—ఇంకెక్కడి పాపాయి? ఇప్పుడు మనం వెతికేది దాని ఆత్మకోసం. ఇక్కడే ఎక్కడో మనకోసం వెదుకుతూ, తిరుగుతూ ఉంటుంది. తప్పక మన ముగ్గురి ఆత్మలూ కలుసుకుంటాయి. ప్రయత్నం మానవద్దు. అన్వేషణ ఆపవద్దు."

* * *

ఆకాశంమీద ఒక నక్షత్రం కిందికి దిగజారుతున్నది వెలుగులు చిమ్ముతూ. మరొక నక్షత్రం దాని వెనకాలే మెరుస్తూ ప్రయాణం చేస్తున్నది. ఆ రెండు కాంతిపుంజాలు హిరోషిమా మీదికి దిగాయి.

"అకిరా, ఏమిటా వెలుగు?"

"ఒకటికాదు—రెండు. ఎవరో ఆ మహానుభావులు! మనలాగే వారి ఆత్మలు కూడా తిరుగాడుతూ ఉండచ్చు."

మొదటి నక్షత్రం వెలుగులు చిమ్ముతూ మానవాకారం దాల్చింది. అది ఒక మహాతేజస్సు. ఆ ఆకారాన్ని చూడలేవు, మానవుని కళ్లు. కానీ అకిరా, ఫూజికోల ఆత్మలు చూడ గలుగుతాయి. రెండవ నక్షత్రం కూడా ఒక స్త్రీమూర్తి ఆకారం దాల్చింది. వారి మాటలు ఫూజికో, అకిరా వింటున్నారు, ఆశ్చర్యంతో.

"ప్రాణేశ్వరీ, నేను మొదట్లోనే నారదుడికి చెప్పాను—ఈ యురేనియమ్ రహస్యం మనుష్యలోకానికి తెలియకూడదని. సృష్టిలో ఒక గొప్ప వస్తువు ఉంటే అది మానవలోకానికి మంచి చేయడానికే! కానీ మానవుడు దాన్ని దుర్వినియోగం చేస్తాడు. మంచి ఫలితాలకి ఉపయోగించుకోకుండా దాన్ని చెడ్డ ఫలితాలకే ఉపయోగించుకుంటాడు. దాని ఫలితం 'ఆటంబాంబు'. ఈ యురేనియమ్ రహస్యం ఎవ్వరికీ చెప్పవద్దని ఆ నారదుడికి చెబితే వింటేనా?"

"ప్రాణేశ్వరా! సమస్త ప్రాణికోటికీ మూలాధారమైన వర్తమాన భూత భవిష్యత్తులను కరకమలాల్లో శంఖ చక్ర గదా రూపాల్లో ధరించిన మీకు తెలియనిదేముంది? ఆ నారదుడు కేవలం కారణమాత్రుడు."


"నారాయణ నారాయణ!" అంటూ ప్రవేశించింది మరొక తేజస్సు. ఆ తేజస్సునుంచి వీణానాదం వినవస్తున్నది.

"అదుగో—మాటలోనే వచ్చాడు నారదుడు."

"నారదా, నీవుచేసిన పనికి నిన్ను క్షమించను. ఆ యురేనియమ్ రహస్యం నీవు మానవలోకానికి చెప్పవద్దన్నా, ఒక విజ్ఞాని చెవిలో రహస్యంగా చెప్పావు. అణువు బద్దలయితే బ్రహ్మాండాలు బద్దలవుతాయన్న నిజం అతని మెదడులో

జాల విన్యాసం

ఫోటో – దర్భ లక్ష్మణశర్మ (పాండిచేరి)


CENTRAL LIBRARY HYDERABAD

ప్రవేశపెట్టారు. దాని ఫలితం అటంబాంబు."

"నారాయణ నారాయణ! వినాశకాలే విపరీత బుద్ధిః అన్నారు పెద్దలు. మంచి చెయ్యబోతే మానవుడు ఈ విజ్ఞానాన్ని దురుపయోగం చేసుకున్నాడు. దాని ఫలితం ప్రపంచం అంతా భస్మీపటలం కావడం."

"నారదా! నువ్వు ఇప్పుడు చంద్రమండలం నుండి వస్తున్నట్టున్నది. అక్కడి విశేషాలేమిటి?

"ఏముంది? మానవుడు చాలా గడుసరి. ప్రపంచం నాశనం కాకముందే—నాశనం ఎలాగా అవుతుందని—చంద్రమండలంలో వలసరాజ్యాలు ఏర్పరుచుకొన్నారు. అక్కడ అన్ని రాజ్యాలూ మళ్లీ స్థాపించారు. రష్యా, అమెరికాలవి పెద్ద భాగాలు. మిగతావాళ్లవి చిన్న భాగాలు. అయితే సృష్టి ఎలాగా అని విచారించవలసిన అవసరం లేదు. కాగా, ఏంచెయ్యమంటున్నారో ఈ భూదేవి ఆక్రందను నాలించారు.

"ఈ హిరోషిమాలో ఇద్దరు వ్యక్తులు మిగిలిపోయారు. వాళ్లకు వ్యక్తిత్వంలేదు. వారి ఆత్మలు తిరుగుతున్నాయి, అనంతాన్వేషణలో, వారి ప్రేమ చిహ్నాన్ని వెదుక్కుంటూ. సృష్టి ప్రారంభించాలంటే వారిలోనే ప్రారంభించాలి" అంటూ విష్ణునామస్మరణ చేసుకుంటూ అంతర్ధానమైనాడు నారదుడు.

"దేవీ, నారదుడి సలహా ఎలా ఉంది? నీ ఉద్దేశం?"

"నారదుడితో నేను ఏకీభవిస్తున్నాను."

"ఎవరో వస్తున్నట్టున్నది. ఈ రాళ్ళ వెనక నిలబడి ఉందాము."

* * *

ఒక కాంతిపుంజం ప్రవేశించింది. అశరీరవాణి వినబడుతున్నది. క్రమంగా ఆ కాంతిపుంజం రూపం దాల్చింది. మరొక కాంతిపుంజం దాన్ని సమీపిస్తూ రూపం దాల్చింది.

"ఐన్‌స్టీన్! నువ్విలా ఎందుకు వచ్చావు?"

"ఏమీలేదు. అణ్వాయుధయుద్ధం ఫలితాలు చూడడానికి. నేను ఎంత మొత్తుకున్నా వింటేనా ఈ రాజ్యాలు? హిరోషిమాపైన అటంబాంబు ప్రయోగించారు. నాశనం అయింది. తరువాత అవే అటంబాంబులతో ప్రపంచమే భస్మీపటలమయింది. నీ శాంతిసందేశాలు వింటేనా, మానవులు? నీ అహింసామతం వారి మనసు కెక్కిందేనా? మహాత్మా! నువ్వెందుకు వచ్చావు ఇక్కడికి?"

"ఇక్కడ ఎవరో ఇద్దరు వ్యక్తుల ఆత్మలు ఒకటే విలపిస్తున్నాయి. ఆ ఆక్రందన వారి పాపాయికోసం. ఆ పాపాయి ఆత్మకోసం వారు అన్వేషిస్తున్నారు. నాకు చేతనైన సహాయం చేద్దామని వచ్చాను" అన్నాడు గాంధీమహాత్ముడు.

"సరే. ఇప్పుడు మనం చేసేది ఏమీలేదు. మానవుని తెలివితక్కువవల్ల ప్రపంచం భస్మీపటలమయింది. పాలబుగ్గల పాపాయిల బోసి నవ్వులు, యువకుల ఆశయాలు, దేశనాయకుల శాంతిసందేశాలు—అన్నీ మాయమయ్యాయి అటంబాంబులతో. మనం దైవాన్ని ప్రార్థిద్దాము, వీరి పాపాయి ఆత్మ వీరికి దొరకాలని. ఇదే నా ప్రార్థన!

"రఘుపతి రాఘవ రాజారామ్! పతిత పావన సీతారామ్...."

లక్ష్మి అన్నది: "పాపం చూశారా, ఆ గాంధీమహాత్ముడు మిమ్మల్ని పిలుస్తున్నాడు. ఆయన ప్రార్థన వినండి. భూలోకంలో సృష్టి ప్రారంభించమని బ్రహ్మకు వార్త పంపండి. మీరు ఆలోచించుకోవాలి కానీ—ఎంతసేపు!"

"మహాప్రభూ! నన్ను తలచుకొన్నారు. ఏం చెయ్యమని ఆజ్ఞ? సృష్టి ప్రారంభించమన్నారా?" బ్రహ్మ అడిగాడు.



సికిందరాబాద్‌లోని గడియారపు స్తంభం

ఫోటో—వి. ఎస్. సేలం (సికిందరాబాద్)

"అవశ్యం చెయ్యవచ్చు." విష్ణువు సమాధానం విని, అంతా అంతర్ధానమయ్యారు.

* * *

శరీరంతో లేకా, ఆత్మలో సంతోషంతో చూస్తూ ఉన్నారు. వారి కెదురుగా వారి పాపాయి ఆత్మశరీరం దాల్చింది. ఆ పాపాయి బోసి నవ్వులో ఆ దంపతులు మైమరిచారు. ఆ పాపాయితో సృష్టి ప్రారంభం అయింది, భూలోకంలో.

చంద్రమండలంలో రాత్రి 12 గంటలు. చర్చి గంటలు వినవచ్చాయి—కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ, పాత సంవత్సరానికి వీడ్కోలు ఇస్తూ. క్రీ. శ. 2000 జనవరి నెల 1 వ తారీఖు ప్రారంభం అయింది. అదే సమయంలో భూలోకంలో కూడా కొత్త సృష్టి ప్రారంభమయింది నవీనయుగంలో. ★

STATE CENTRAL LIBRARY HYDERABAD A.P.